భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0
తణుకు : 35.0 - 25.0

సొంతింటి కల సాకారానికి పీఎంఏపై

7



బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

24 క్యారెట్లు గ్రాము రూ.7,500

22 క్యారెట్లు రూ.6,900

7

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛతా హీ సేవ

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రధాన మంత్రి మోదీ పిలుపుతో రోడ్లు ఊడ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు



భీమవరంలో రోడ్లు శుభ్రం చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మీ, ఎమ్మెల్యేలు రఘురామ, అంజిబాబు



మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ

కొల్లేరును పరిరక్షించాలి

- ఆక్రమణలు తొలగించి.. ముంపు నివారించాలి
- సీపీఐ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు నారాయణ, రామకృష్ణ

కైకలూరు, సెప్టెంబరు 17: ప్రపంచస్థాయిలో పేరు ప్రఖ్యాతలు వున్న కొల్లేరు సరస్సును కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండవల్లి మండలం పెద్ద, చిన్నఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ముంపును పార్టీ నేతలు, అధికారులతో కలిసి పరిశీలించారు. నారాయణ మాట్లాడుతూ కొల్లేరు సరస్సులో చేపల చెరువులను అక్రమంగా తవ్వడంతో కాలుష్య కోరల్లో చిక్కుకుని, వరద నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందని అన్నారు. బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరుల్లోని ఆక్రమణల ప్రక్షాళన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లేరు ఆపరేషన్ చేసి కొద్ది మేర ఆక్రమణలను తొలగించిందని, కాని మళ్లీ అభయారణ్యం ఆక్రమణకు గురైందన్నారు. బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, చంద్రయ్య డ్రెయిన్, ఎర్ర కాలువ వంటి 64 డ్రెయిన్ల ద్వారా లక్ష క్యూసెక్కుల వరద నీరు కొల్లేరులోకి చేరుతోందన్నారు. ఈ నీరంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళుతుందన్నారు. కొల్లేరు ప్రక్షాళన చేస్తే ప్రభుత్వానికి సీపీఐ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరు ప్రక్షాళన చేయడంలో సుప్రీంకోర్టు మార్గదర్శ కాలను పాటించాలని, ఇందుకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. తాజాగా సంభవించిన వరదలతో ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు పూర్తిస్థాయిలో అతలాకుతలం అయ్యాయన్నారు. బుడమేరు ఆక్రమణల వల్ల విజయవాడ నష్టపోయిందన్నారు. జీవో నెంబరు 120 ప్రకారం 77,136 ఎకరాల్లో కొల్లేరు విస్తరించి వుందని దీనిని కాపాడాలన్నారు. కొల్లేరులో ఆక్రమణలు తొలగించి, చేపలు, రొయ్యల సాగును అరికట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి ఉప్పాల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య రైతు సంఘ నాయకులు, డ్రైనేజీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషణ ఎలా..



జిల్లాలో ఆగస్టు నెలలో అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిపివేయగా, పామాయిల్ కూడా అంతంత మాత్రమే సరఫరా చేశారు. ప్రస్తుతం సెప్టెంబర్ నెల సరఫరా కూడా అదే విధంగా ఉండడంతో పోషణ కష్టాలు అంగన్‌వాడీ కేంద్రాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

- అంగన్‌వాడీలకు అందని సరుకులు
- ఆగస్టు నెలలో కందిపప్పు కట్
- పామాయిల్ అంతంత మాత్రమే సరఫరా
- సెప్టెంబరులో కూడా ఇదే పరిస్థితి

అత్తిలి, సెప్టెంబరు 17: జిల్లాలోని 1556 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 70 మిని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలు 43,783 ఉండగా, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు 19,672 మంది ఉన్నారు. జిల్లాలోని 8596 మంది గర్భిణులు ఉండగా, 6170మంది బాలింతలు ఉన్నారు. మొత్తం 78221 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా అందిస్తున్న పోషకాహార కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఐదు లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, అరలీటరు మంచినూనె అందిస్తారు. అయితే ఆగస్టు నెల జిల్లాలో కందిపప్పు ఇవ్వలేదు. పామాపాయిల్ కూడా అంతంతమాత్రంగానే ఉంది. గత నెలలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు పోషణ అందలేదు. కందిపప్పు లేకపోవడంతో కేంద్రాల్లో కూడా మెనూ అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. సరుకులు పూర్తిగా సరఫరా కాకపోవడంతో గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు కూడా పౌష్టికాహారం అందలేని పరిస్థితి నెలకొంది.

సంక్షోభంలో పౌరసరఫరాల కార్పొరేషన్

గత వైసీపీ ప్రభుత్వం పౌరసరఫరాల కార్పొరేషన్‌ను అనుకోని విధంగా దెబ్బతీసింది. ప్రతి నెలా సరఫరా చేసే రేషన్ సరుకులు ఇవ్వలేని దీనావస్థలో పౌరసరఫరాల శాఖ దిగజారింది. ఇప్పుడు ఆ సంక్షోభం అంగన్‌వాడీ కేంద్రాలను చుట్టుముడుతున్నది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు కూడా కందిపప్పు పూర్తిగా అందించకపోగా పామాయిల్ అంతంత మాత్రంగానే సరఫరా చేసింది. వైసీపీ హయాంలో ఏడాది క్రితం ఇదే పరిస్థితి ఉండగా ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు నుంచి పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించి మరలా అదే పరిస్థితి పునరావృతం అవుతున్నది. ఈ పరిస్థితిని చక్కదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం అధికారయంత్రాంగం చర్యలు తీసుకోకపోతే అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ కార్యక్రమం పూర్తిగా నీరుగారిపోయే ప్రమాదం కనిపిస్తున్నది.

సరుకులు పూర్తిస్థాయిలో ఇవ్వాలి

పి.దీనమ్మ, అత్తిలి



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సరుకులను పూర్తి స్థాయిలో సరఫరా చేసేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సరుకులు సక్రమంగా అందించినట్లయితేనే అంగన్‌వాడీ కేంద్రాలకు తమ చిన్నారులను పంపించడానికి ఆసక్తి చూపుతాం.

తణుకు, నరసాపురం పన్నుల చెల్లింపులో టాప్



నరసాపురం, సెప్టెంబరు 17: పురపాలక సంఘాల్లో ఇంటి, నీటి పన్ను వసూళ్లల్లో జిల్లాలో తణుకు, నరసాపురం పురపాలక సంఘాలు మొదటి స్థానాల్లో నిలిచాయి. తణుకు పురపాలక సంఘం డిమాండ్ కంటే ఈ నెలలో అత్యధికంగా ఇంటి పన్ను వసూలు చేసింది. ఇటు నీటి పన్ను వసూళ్లలో నరసాపురం మునిసి పాలిటీ గత రికార్డులను తిరగరాసింది. జిల్లాలోని ఆరు పురపాలక సంఘాలలో మంగళవారం నాటికి ఇంటి పన్ను డిమాండ్ రూ63.88 కోట్లు ఉంది. ఇందులో తణుకు పురపాలకం రూ.11.48 కోట్లు ఉండగా.... సెప్టెంబర్ నెలలో రూ.5.74 వసూలు చేయాలని టార్గెట్ ఇచ్చారు. అయితే ఈ మునిసిపాలిటీ రూ.6.48 కోట్లు వసూలు చేసి మొదటి స్థానంలో నిలి చింది. ఇక నరసాపురం మునిసిపాలిటీ రూ.5.48 కోట్లు బకాయిలు ఉన్నాయి.



ఈ నెలలో రూ.2.74 కోట్లు టార్గెట్ ఇవ్వగా రూ. 2.26 కోట్లు వసూలు చేశారు. భీమవరం రూ.23.48 కోట్లు డిమాండ్ ఉండగా రూ.11.74 కోట్లకు గాను రూ.9.45 కోట్లు, పాలకొల్లు రూ.6.72 కోట్లుకు గాను రూ. 3.36కోట్లు డిమాండ్ ఉండగా మంగళవారం నాటికి రూ. 2.63 కోట్లు, టీపీగూడెంలో రూ.13.65 కోట్ల డిమాండ్‌కు గాను రూ.6.82 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.5.82 కోట్లు, ఆకివీడు రూ.3.08 కోట్లు డిమాండ్‌కు గాను రూ.1.54 కోట్ల టార్గెట్‌కు గాను రూ.కోటి మాత్రమే వసూలు చేశారు. మొత్తం డిమాండ్ రూ.63.88 కోట్లలో మంగళవారం నాటికి రూ.26.80 కోట్లు వసూలైంది.

ఇక నీటి పన్ను వసూళ్ళ డిమాండ్ రూ.9.94కోట్లు ఉండగా నరసాపురం మునిసిపాలిటీ రూ.1.33 కోట్లు లక్ష్యం ఉన్నది. ఇందులో రూ.50.40లక్షలు వసూలు చేశారు. తణుకులో రూ.2.73కోట్లు ఉండగా రూ.1.02 కోట్లు వసూలు చేసి రెండోవ స్థానంలో నిలిచింది.

కొత్త డీలర్లు వస్తారా?



అధిక కార్డులున్న డీలర్ల గుర్తింపు

ప్రక్షాళనకు కసరత్తు

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : జిల్లాలో డీలర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. రేషన్‌దుకాణాలను హేతుబద్ధీకరించనున్నారు. గాడితప్పిన ప్రజా పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. రేషన్ సరుకులను వేగవంతంగా పంపిణీచేసేందుకు అవసరమైతే కొత్త డీలర్లను నియమించనున్నారు. జిల్లాలో ఒక్కో డీలర్ పరిధిలో 800 కార్డులు పైబడి ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 400 నుంచి 500 వరకు ఉండాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అంతకుమించి ఉన్నకార్డులను డీలర్ల నుంచి తపి ్పంచనుంది. కొత్తగా డీలర్లుకు అప్పగించటంకానీ లేదా సమీపంలో ఉన్న డీలరుకు బదలాయింపు కానీ చెయ్యనున్నారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ డీలర్ల వద్ద ఉన్న కార్డులను గుర్తించే పనిలో నిమగ్న మైంది. గ్రామీణ ప్రాంతాల్లో 400నుంచి 450, పట్టణ ప్రాంతాలల్లో 500నుంచి 550, నగరాల్లో 600 నుంచి 650 కార్డులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

రేషన్ దుకాణాల షెడ్యూల్ విడుదల

రేషన్ దుకాణాల హేతు బద్ధీకరణ కోసం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబరు 16లోగా పక్రియ పూర్తి చెయ్యాలని దిశానిర్దేశం చేసింది. ఖాళీల గుర్తింపు పక్రియను ఈనెల 30నుంచి వ చ్చేనెల 8లోగా పూర్తిచెయ్యాలి. అలాగే అదేనెల 16వ తేదీ నాటికి రేషన్ కార్డుల ప్రతిపాదనలు కొత్తప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం పొందాలి. అలాగే కొత్త చౌక దుకాణాల ఏర్పాటుకు వ చ్చేనెల 24న ప్రకటన జారీచేస్తారు. వారికి నవంబరు 7న రాత పరీక్ష నిర్వహిస్తారు. అదే నెల 12న మౌకిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నియామక ఉత్తర్వులు అందిస్తారు. ఆ మేరకు పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో రేషన్ కార్డులు ఇలా..

జిల్లా వ్యాప్తంగా సుమారు 5లక్షల 67వేల 500 కార్డులు ఉన్నాయి. వాటిని పట్టణాలు గ్రామాల వారీగా అందరి డీలర్లకు అటుఇటుగా సమానరీతిలో కార్డులు ఉండేలా హేతుబద్ధీకరించనున్నారు. కొందరికి ఎక్కువగా కార్డులు ఉండటంతో పంపిణీ ఇబ్బందిగా మారింది. వాహన దారులుకూడా ఇబ్బంది పడుతున్నారు. కొందరికే కమిషన్ రూపంలో అధిక మొత్తం లభిస్తోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ప్రక్షాళనకు దిగింది. కొత్త రేషన్ దుకాలు ఏర్పాటు చేస్తారాలేక, ఉన్నవాటితోనే సర్దు బాటు చేస్తారా అనేది త్వరలో తేలనుంది.

పంచాయతీ సొమ్ము బొక్కేశారు..

- బీపీఎస్, ఎల్ఆర్ఎస్ సొమ్ములు వేరే పథకాలకు మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీలు

చినఅమిరం గ్రామ పంచాయతీ భీమవరంలో దాదాపు కలసిపోయింది. ప్రభుత్వం అమలు చేసిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకంలో పంచాయతీకి దాదాపు రూ.3.80 కోట్ల ఆదాయం లభించింది. యుడా ఖాతాలో ఆ సొమ్మంతా ఉండాలి. నిబంధనల ప్రకారం 80శాతం నిధులు పంచాయతీకి రావాలి. కానీ పైసా విడుదల చేయలేదు. నిధులు జమ అయితే అభివృద్ధి పనులు చేపట్టేందుకు పంచాయతీ ప్రణాళికలు చేసుకుంటోంది, కానీ పైసా మంజూరు కాలేదు. వాస్తవానికి యుడా వద్ద ఉన్న సొమ్మంతా వైసీపీ ప్రభుత్వం వేరే పథకాలకు మళ్ళించడంతో పంచాయతీలకు సమస్య తలెత్తింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్‌లు, భవనాల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలను అమలు చేశారు. వైసీపీ ప్రభుత్వం 2019లో పథకాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పంచాయతీల పరిధిలో అనధికార లేఅవుట్‌లు, భవనాలను క్రమబద్ధీకరించుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల్లో పంచాయతీలకు పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చింది. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధి(యుడా)లో క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. తద్వారా వచ్చిన సొమ్ములను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించింది. పంచాయతీలకు రావాల్సిన సొమ్ములు ఇప్పటిదాకా ఇవ్వలేదు. యుడా ఖాతాలోనే సొమ్ములు వేశారు. పంచాయతీలకు 80శాతం సొమ్ములను యుడా చెల్లించాలి. మిగిలిన 20శాతం యుడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టాలి. కానీ మొత్తం సొమ్ము అంతా యుడా పరిధిలోనే ఉన్నాయి. అవికూడా యుడా ఖర్చు పెట్టుకోవడానికి అవకాశం లేదు. వైసీపీ ప్రభుత్వం మొత్తం సొమ్ములను సొంత అవసరాలకు వినియోగించుకుంది. ఫలితంగా పంచాయతీలు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నాయి. సొమ్ములు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం తాత్సారం చేసింది. జిల్లాలో రూ.50 కోట్లు మేర పంచాయతీల నుంచి ఆదాయం సమకూరినట్టు అంచనా వేస్తున్నారు. అందులో రూ. 40 కోట్లు పంచాయతీలకు రావాల్సి ఉంది. వాటితో అభివృద్ధి పనులు చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. వైసీపీ హయాంలో పైసా జమ చేయలేదు. మరోవైపు పంచాయతీలను అప్పుల ఊబిలోకి నెట్టేసింది. ఆర్థిక సంఘం నిధులను కూడా దారిమళ్లించింది. పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయలేదు. ఉపాధి హామీ నిధులను రాబట్టలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులకు వినియోగ ధృవీకరణ పత్రాలను సమర్పించలేదు. దాంతో పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. కనీసం బీపీఎస్, ఎల్ఆర్ఎస్ సొమ్ములను పంచాయతీలకు జమ చేసినా సరే పెద్ద ఊరట లభించనుంది. వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

ఆ.. పంచాయతీలకు అధిక ఆదాయం

జిల్లాలో పట్టణ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో లేఅవుట్‌లు, భవనాలు వెలిశాయి. పట్టణాలు పల్లెలదాకా విస్తరించాయి. భీమవరం పట్టణంలో చిన అమిరం, తాడేరు. రాయలం, విస్సాకోడేరు. పెద అమిరం పంచాయతీలు దాదాపు కలసిపోయాయి. భీమవరం అంటే ఇప్పుడు సదరు పంచాయతీల్లోనే భవనాలు వెలస్తున్నాయి. తాడేపల్లిగూడెంలోనూ అదే పరిస్థితి. పెంటపాడు. ప్రత్తిపాడు, పెదతాడేపల్లి, కుంచనపల్లి, దర్శిపర్రు గ్రామ పంచాయతీల పరిధిలో పట్టణం విస్తరిస్తోంది. తణుకు విషయానికొస్తే పైడిపర్రు, మండపాక, వీరభద్రపురం, తేతలి, వేల్పూరు వంటి పంచాయతీల పరిధిలోనే ఇప్పుడు భవనాలు నిర్మిస్తున్నారు. లేఅవుట్‌లు వేస్తున్నారు. పాలకొల్లు మునిసిపాలిటీకి ఆనుకుని దగ్గులూరు, యాళ్లవాని గరువు, ఉలంపర్రు, పూలపల్లి పంచాయతీల్లో పట్టణం విస్తరిస్తోంది. నర్సాపురం విషయానికొస్తే లక్ష్మణేశ్వరం, రుస్తుంబాద, చినమామిడిపల్లి, వైఎస్‌పాలెం పంచాయతీలవైపు పట్టణం విస్తరిస్తోంది. ఆ పంచాయతీల్లో బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకంలో పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చింది. అలాగే మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలకు ఆదాయం సమకూరింది. జిల్లాలో 409 పంచాయతీలున్నాయి. క్రమబద్ధీకరణలో వచ్చే ఆదాయం కూడా వైసీపీ హయాంలో దారిమళ్లించారు. కూటమి రాకతో తమ నిధుల కోసం పంచాయతీలంతా ఎదురుచూస్తున్నాయి.

కూటమి రాకతో ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. నిధులు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. కొత్తగా నిధులు రాబట్టేందుకు పంచాయతీల నుంచి ప్రతిపాదనలు పంపుతున్నారు. మరోవైపు ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసింది. దాంతో పంచాయతీలు ఊపిరి పీల్చుకున్నాయి. అభివృద్ధి పనులు నిర్వహించేందుకు పంచాయతీలు తహతహ లాడుతున్నాయి. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల్లో పంచాయతీలకు రావాల్సిన నిధులను జమచేస్తే పెద్ద ఊరటే లభించనుంది. అందుకోసం పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి.

వసతి గృహ బాలికలపై లైంగిక వేధింపులు

- మేట్రిన్ భర్త దురాగతం
- బయట ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక దాడులు
- వెలుగులోకి వచ్చిన పలు సంఘటనలు
- పోలీసులకు ఫిర్యాదు ∙ కేసు నమోదు
- పరారీలో మేట్రిన్, ఆమె భర్త

7

ముగిసిన పవిత్రోత్సవాలు


తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 17: శ్రీ అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పవి త్రోత్సవాలు ఐదో రోజు మంగళవారం స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆళ్వార్లకు అలంకార తిరుమంజనోత్సవం నిర్వహించి, శాంతి కల్యాణం జరిపించారు. సాయంత్రం రథోత్సవంతో శ్రీవారి పవిత్రోత్సవాలు ముగిశాయి. ప్రధానార్చకుడు కరివెంకట శ్రీనివాసాచార్యులు, అర్చకులు పవన్ కుమారాచార్యులు, పూలపల్లి కృష్ణమాచార్యులు, రంగనాథాచార్యులు, పండితులు ప్రత్యేక వేద పఠనం గావించారు. భక్తులకు ప్రసాద వినియోగంగావించారు. పాలక కార్యనిర్వహణాధికారి బీవీవీఎస్ శంకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరి ఉత్పత్తులకు డిమాండ్


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17: కొబ్బరి ద్వారా అనేక ఉప ఉత్పత్తుల తయారీపై యువతకు శిక్షణ ఇస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారని ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో కొబ్బరి ఉత్పత్తుల తయారీ, విలువ జోడింపు (ట్రైనర్ ట్రైనీ)పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పని చేస్తున్న గృహ విజ్ఞానం, ఉద్యాన శాస్త్రవేత్తలకు ఈ శిక్షణ ఇచ్చారు. విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు ఎం.మాధవి, విస్తరణా సంచాలకులు బి.గోవింద రాజులు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కుమార్‌వేల్ మాట్లాడారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 2023-24 గాను ప్రకటించిన వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కేఎస్ ప్రభాకర రావు తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 పర్యాటక సంబంధిత రంగాల అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్ సైట్స్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈ నెల 22 తేదీ లోపు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబరు 63099 42024లో సంప్రదించాలని సూచించారు.

21న క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17: పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏలూరులోని ఆశ్రమం మెడికల్ కాలేజీలో అండర్ -14, బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏజీ ఆదిత్యవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వ్యక్తిగత కిట్, బాల్స్‌తో ఉదయం తొమ్మిది గంటల కల్లా హాజరుకావాలన్నారు. క్రీడాకారులు 2010, సెప్టెంబరు ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కార్యదర్శి వీవీఎస్ఎన్ శ్రీనివాసరాజు తెలిపారు.

24న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈ నెల 24న ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ నాలుగు నుంచి ఆరో తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గాను ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయస్సు గల వారికి, అండర్-23 విభాగంలో బాల బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం లేదా 10వ తరగతి మార్కులిస్ట్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. మరింత సమాచారానికి 62814 31202 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి హేకథాన్ వేదికగా నిలవాలి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 : సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనకు హేకథాన్ ఒక వేదికగా నిలవాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ ఆధ్వర్యంలో 12 గంటలపాటు జరిగే హేకథాన్ కార్యక్రమం టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2017లో ప్రధాని మోదీ యువ మేధావులను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన స్మార్ట్ ఇండియా హేకథాన్ కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులు ఇప్పటికే జాతీయ స్థాయిలో రెండుసార్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన వంద టీమ్‌లు పంపుతున్నామన్నారు.

న్యాయవాది మృతిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17: నగరానికి చెందిన ఓ న్యాయవాది మృతి కేసులో ఆయన భార్య, ఆమె తరపు కుటుంబ సభ్యులపై టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ఆర్ పేటకు చెందిన నాయ్యవాది పయనం కార్తీక్ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో మనీషా ప్రియా యాదవ్‌ను 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత ఏలూరులో కొంత కాలం కాపురం చేశారు. కార్తీక్ ఎస్సీ, భార్య మనీషా ప్రియాయాదవ్ బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు. కాలక్రమంలో భార్య తరపు కుటుంబ సభ్యులు కుల వివక్ష చూపేవారు. 2023 ఏప్రిల్‌లో మనీషా భర్త కార్తీక్ యాదవ్‌ను వదిలి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆమె తన కుటుంబ సభ్యులతో ఉంటూ కార్తీక్‌పై కేసులు పెట్టారు. దీంతో మనోవ్యధకు గురైన కార్తీక్ తీవ్ర అనారోగ్యానికి గురై ఈ ఏడాది ఆగస్టులో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన కుమారుడి మృతికి అతని భార్య, ఆమె తరపు కుటుంబసభ్యుల వేధింపులే కారణమని మృతుడి తండ్రి రత్నరాజు ఏలూరు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కార్తీక్ భార్య మనీషా, ఆమె కుటుంబ సభ్యులైన మాధవీ యాదవ్, స్వప్న ప్రియాయాదవ్, మారబోయిన శ్రావణ్‌కుమార్ యాదవ్, గెల్లబోయిన శ్రావణ్‌కుమార్ యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌ఎంపై సమగ్ర విచారణకు చర్యలు

ముదినేపల్లి, సెప్టెంబరు 17 : ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్‌లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సస్పెండై ప్రస్తుతం ఇంగిలిపాకలంక హైస్కూల్ హెచ్‌ఎం శాంతకుమారిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌరి, హైస్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ నరసింహమూర్తి, మాజీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యేని కలసి హెచ్‌ఎంపై ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 19న విచారణ జరుగుతున్నందున అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. దీనిపై తాను కలెక్టర్, డీఈవోతో మాట్లాడి విచారణ సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ


భీమవరం అంబేడ్కర్ సెంటర్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ ఒక్క కార్యక్రమం విజయవంతం కాదని, నేటి నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ లక్ష్యాలను నెరవేర్చాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా పేరిట కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. చెత్త వాహనాల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం మానడం కోసమే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మరుగుదొడ్ల కార్యక్రమం తలమానికంగా నిలిచిందన్నారు. తొలుత వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద రైల్వే అండర్ పాస్ పక్క రోడ్డులో చీపుర్లు చేతబట్టి చెత్తను శుభ్రం చేసి, డస్ట్ బిన్స్‌లో వేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జయసూర్య, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బి.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఆర్.రాంబాబు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, వేగేశన్న కృష్ణంరాజు, మెప్మా ఆర్పీలు, డీఎన్ఆర్ కాలేజ్ ఎన్‌సీసీ విద్యార్థులు కేజీఆర్ఎల్ కళాశాల, డాక్టర్ సీఎస్ఎన్ కళాశాల, పీఎంఎస్ బాలికలు స్కూలు, జేఎల్‌బీ బాలికల స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జ్యోతిక, మాజీ సైనికులకు సత్కారం

మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడు కలిదిండి వినోద్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో భీమవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంత్రి వర్మ చేతుల మీదుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 4×400 మీటర్స్ రన్నింగ్‌లో పాల్గొన్న తణుకునకు చెందిన దండి జ్యోతికను సన్మానించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇద్దరు మాజీ సైనికులకు సత్కరించారు. మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఫోటో ఎగ్జిబిషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, కాయిత సురేంద్ర, అరస వల్లి సుబ్రహ్మణ్యం, కోమటి రవి కుమార్, ఆడబాల శివ, మొహిద్దీన్ రాజు, గోవర్ధన్, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, అయినంపూడి శ్రీదేవి, లంక లక్ష్మి, రమాదేవి, వబిలిశెట్టి ప్రసాద్, అరసవల్లి మణికంఠ పాల్గొన్నారు.

బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

- తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పైపైకి
- 24 క్యారెట్లు గ్రాము రూ.7,500
- 22 క్యారెట్లు రూ.6,900



నరసాపురం, సెప్టెంబరు 17: పసిడి ధర తగ్గినట్టె తగ్గి.. మళ్లీ దూసుకుపోతోంది. మంగళవారం గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,500 ఉండగా... ఆర్నమెంట్ బంగారం రూ.6,900లకు చేరింది. గడిచిన 15 రోజుల నుంచి పసిడి ధర క్రమంగా పెరుగుతూ వస్తుంది. దీంతో మళ్లీ ఆల్‌టైం రికార్డు ధరను క్రాస్ చేస్తుందా? అన్న ఊహాగానాలు బులియన్ మార్కెట్‌లో షికారు చేస్తున్నాయి. కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బంగారం ధరల్ని తగ్గించాలని కస్టమ్ డ్యూటీని 9 శాతం తగ్గించింది. దీంతో ధరలు ఒక్కసారిగా దిగిపోయాయి. కేంద్ర బడ్జెట్ తరువాత గ్రాము బిస్కెట్ బంగారం రూ.6,900కు దిగిరాగా... ఆర్నమెంట్ బంగారం ఒక్కసారిగా రూ.6,350కి పడిపోయింది. దీంతో వినియోగదారులు ధరలు ఇంకా తగ్గుతాయని అంచన వేశారు. దానికి తగ్గట్టుగానే కొన్ని రోజులు నిలకడగా కొనసాగింది. అయితే అంతర్జాతీయంగా నెలకొన్ని పరిస్థితులతో మళ్లీ పసిడి ధర పరుగులు తీస్తోంది. గడిచిన వారం రోజుల నుంచి క్రమం గా పెరు గుతూ వస్తుంది. దీంతో బులియన్ మార్కెట్‌కు పేరొందిన నరసాపురం మార్కెట్‌లో అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. ఒక్కసారిగా తగ్గి నెల రోజుల్లోనే మళ్లీ బంగారం పెరుగుతుండటంతో చాల మంది కొనేందుకు వెనుకంజ వేస్తున్నారు.

వసతి గృహ బాలికలపై

లైంగిక వేధింపులు

- మేట్రిన్ భర్త ఘాతుకం
- బయట ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక దాడులు
- వెలుగులోకి వచ్చిన పలు సంఘటనలు
- పోలీసులకు ఫిర్యాదు..
- కేసు నమోదు
- పరారీలో మేట్రిన్ ఆమె భర్త


శశికుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : నగరంలో ఉన్న ఒక బాలికల వసతి గృహంలో చదువుతున్న బాలికలపై ఆ వసతి గృహ మేట్రిన్ భర్త అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడనే అభియోగంపై ఫిర్యాదు అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బాధితులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ప్రకారం.. పేద పిల్లలు, అనాథ పిల్లలకు విద్యను అందించాలనే ఆశయంతో అమెరికాలో ఉన్న గురుకృప ఫౌండేషన్ ఏలూరుకు చెందిన ఒక స్వామీజీ పర్యవేక్షణలో అమీనాపేటలో రెండేళ్ల క్రితం బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ఆ వసతి గృహం మేట్రిన్‌గా ఫణిశ్రీ అనే ఆమెను నియమించగా ఆమెకు భర్తగా ఉన్న బి.శశికుమార్ తరచుగా అక్కడకు వచ్చి స్వామీజీతో మాట్లాడుతూ తన మేనకోడలు లావణ్యకు కేర్ టేకర్ అవకాశం ఇవ్వాలని కోరడంతో ఆమెను నియమించారు. ఆ తరువాత ఆ స్వామీజీ మరణించడంతో ఆ సంస్థ వీరి చేతులలోకి వెళ్లిపోయింది. శశికుమార్ తరుచుగా వస్తూ పిల్లలకు ఫొటోషాప్ నేర్పిసానంటూ తనకు ఉన్న స్టూడియో వద్దకు తీసుకువెళ్లేవాడు. ఈ విధంగా పిల్లలను తన మాయ మాటలతో సెలవు వచ్చిన రోజు ఫొటోషూట్ అంటూ వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి వారిపై అసభ్యంగా ప్రవర్తించే వాడని చెబుతున్నారు. ఒక బాలికను ఈ నెల 15న బాపట్ల తీసుకువెళ్లి 16వ తేదీ సాయంత్రం తీసుకువచ్చాడు. వచ్చినప్పటి నుంచి ఆ బాలిక నీరసంగా ఉండడంతో తోటి బాలికలకు అనుమానం వచ్చి ఆరా తీశారు. దీంతో జరిగిన విషయం చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. ఈ విషయం బయటకు వచ్చిందని గ్రహించిన శశికుమార్ అతని రెండో భార్య ఫణిశ్రీ ఈ నెల 15వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో పిల్లలను మోకాళ్ల వేయించి కర్రతో చితకబాదారని, అంతేకాకుండా చేతులతో చెంపలపై కొట్టారని చుట్టుపక్కల ఉన్న ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొత్తం మీద ఈ విషయం బయటకు వస్తుందని భావించిన భార్యభర్తలు తెల్లవారేటప్పటికి పరారయ్యారు. ఇదే విషయం వారు చదువుతున్న స్కూల్లోని ఉపాధ్యాయులకు తెలియజేయడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు మంగళవారం సాయంత్రానికి చేరుకున్నారు. పిల్లలు, తల్లిదండ్రులు కలిసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో టూ టౌన్ సీఐ వైవీ రమణ, భీమడోలు సీఐ యూజే విల్సన్, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేయడానికి రంగంలోకి దించారు.

మరోవైపు మహిళా పోలీసులు, మహిళా ఎస్ఐలు బాధితుల నుంచి వాగ్మూలాలను నమోదు చేస్తున్నారు. ఇంకోవైపు జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మంగళవారం రాత్రి సంఘటనా స్థలం వద్ద మాట్లాడుతూ విద్యార్థినులతో అతను అసభ్యంగా ప్రవర్తించినట్లు తనకు మూడు ఫిర్యాదులు అందాయని వాస్తవాలను పూర్తిగా తెలుసుకునేందుకు మహిళా ఎస్ఐలతో విద్యార్థుల నుంచి వాగ్మూలాలను నమోదు చేయిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వీడు మామూలోడు కాదు

గతంలో వివిధ కార్పొరేషన్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద యువతకు ఫొటోగ్రఫీ నేర్పించారు. శశికుమార్ తనకు ఉన్న సత్రంపాడు స్టూడియో ద్వారా యువతీ యువకులకు ఫొటోగ్రఫీ నేర్పిస్తూ ఆయా కార్పొరేషన్ల నుంచి సొమ్ములను తీసుకునేవాడు. అప్పట్లోనే అతనిపై ఎన్నో అభియోగాలు వచ్చాయి. చివరకు ఆ పథకాలన్ని రద్దయ్యాయి. తన స్టూడియోకి ఫొటోల కోసం వచ్చే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని వారిని వలలో వేసుకుని ఫొటోగ్రఫీ నేర్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడని అభియోగాన్నాయి.

అనుమతులేవి?

ఏలూరు అమీనాపేటలో ఉన్న ఈ వసతి గృహానికి అనుమతులు ఎవరు ఇచ్చారనేది అయోమయంగా కనిపిస్తోంది. అక్కడ జరిగిన సంఘటనలు బయటకు రావడంతో పోలీస్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సంస్థలు నిర్వహించాలంటే ఖచ్చితంగా రిజిస్టర్ అయి ఉండాలి. అంతేకాకుండా శిశు సంక్షేమ శాఖ అనుమతులు ఉండాలి. పోలీస్ శాఖకు కూడా తెలియజేయాలి. విద్యా శాఖకు వివరాలు ఇవ్వాలి. కానీ ఇవి ఏమి లేనట్లుగానే తెలుస్తోంది.

విద్యార్థులు ఎలా చేరారంటే..

ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో సీట్ల కోసం వెళ్లిన విద్యార్థినులకు అక్కడ సీట్లు ఖాళీ లేవని అక్కడ ఉన్న వారు చెబుతూ ఉచితంగా ఈ వసతి గృహంలో సీటు ఇస్తారంటూ చెప్పడంతో చివరకు ఆ విధంగా చేర్పించామంటూ అక్కడ కొంత మంది తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. అక్కడ చక్కగానే చూస్తారంటూ కితాబు పలికారని అందుకే అక్కడ చేర్పించామని చెబుతున్నారు. ఒక విద్యార్థిని చేరడం ద్వారా మరో విద్యార్థిని చేరారని, ప్రస్తుతం రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 50 మంది విద్యార్థినులు ఉన్నట్లు చెబుతున్నారు.

క్రైం కార్నర్

వసంతవాడలో మహిళ దారుణ హత్య


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు

పెదపాడు, సెప్టెం బరు 17 : పెదపాడు మండలం వసంతవాడలో ఒంటరిగా నివాసముంటున్న మహిళ దారుణ హత్యకు గురైంది. పెదపాడు పోలీసుల కథనం ప్రకారం వసంతవాడ గ్రామానికి చెందిన గుజ్జుల అనిత (37) ఎస్సీ కాలనీలో సొంత ఇంట్లో ఒంటరిగా నివాస ముంటోంది. ఈమె అవివాహిత కాగా, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం, నారాయణపురానికి చెందిన మెండెం నవీన్‌కుమార్‌తో కొంత కాలంగా సహజీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో నవీన్‌కుమార్‌కు అనితకు మధ్య సోమవారం రాత్రి తగాదా జరగ్గా మద్యం మత్తులో అనితను బలంగా కొట్టడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో మృతి చెందిందన్నారు. అనిత ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి అనా పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మృతి చెందిన అనితను చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, పెదపాడు ఇంచార్జి ఎస్సై కె.స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మృతురాలి చెల్లి కిర్లంపూడి అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వేగంగా వెళ్తున్న జామాయిల బాదుల లోడు లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన మాదాసు రంగబాబు (47)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవరైన రంగబాబు జామాయిల్ బాదుల లోడు వేసుకుని రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గ మధ్యలో ఏలూరు మెయిన్ బైపాస్, వంగూరు మెయిన్ బ్రిడ్జిపై లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీ కొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రంగబాబు అక్కడికక్కడే మరణించాడు. ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు


జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

కాళ్ళ, సెప్టెంబరు 17 : మండలంలోని జువ్వలపాలెంలో సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనం సందర్భంగా తలెత్తిన ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణం ఉండే విధంగా ముందస్తుగా నాలుగు రోజుల పాటు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా బయట వ్యక్తులు ఎవరైనా వచ్చి ప్రతికూల వాతావరణం సృష్టించే విధంగా ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు.

నిమజ్జనంలో యువకుడిపై దాడి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వినాయక నిమజ్జన ఊరేగింపులో కొందరు యువకులు మరో యువకుడి పై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16 రాత్రి రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు కన్నయ్య పార్కు వద్దకు వచ్చేసరికి ఆ ఊరేగింపులో పాల్గొన్న తూర్పువీధికి చెందిన పి.రాజశేఖర్ అనే యువకుడిపై అదే ఊరేగింపులో పాల్గొన్న వాసు, ప్రవీణ్, విక్కీ అనే యువకులు ఘర్షణకు దిగారు. ఊరేగింపు నుంచి బయటకు లాగేశారు. దీంతో రాజశేఖర్ అక్కడ నుంచి తన స్నేహితులతో కలిసి వెళ్లిపోగా రాజీ చేసుకుందాం రమ్మని మళ్లీ ఫోను చేసి కన్నయ్య పార్కు వద్దకు రప్పించారు. అక్కడ మళ్లీ తేజ, వాసు, విక్కీ, ప్రవీణ్, సాయి మరికొంత మంది కలిసి రాజశేఖర్‌ను కర్రలతో కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. కింద పడిపోయిన బాధితుడిని 108లో సర్వజన ఆస్పత్రికి తరలించారు.

బాలికను వేధించిన యువకులు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వినాయకుని నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న ఓ బాలికను కొందరు యువకులు వేధించారు. పక్కనే ఉన్న బాలిక తమ్ముడు దీన్ని అడ్డుకోగా అతనిపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కొత్తపేట పెద్దింటివారి వీధిలో ఈ నెల 16 రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతుంది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు అక్క చెల్లెళ్లేలు, వారి తమ్ముడు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన అగ్గాల ధనుష్, రోహిత్ సాయి, త్రిశూల్, నీరజ్ అనే యువకులు ఈ అక్కాచెల్లెళ్లల్లో ఓ బాలికతో హేళనగా మాట్లాడుతూ ఆమె చేయి పట్టుకుని తాకుతూ వేధించారు. ఆ పక్కనే ఉన్న బాలిక తమ్ముడు వారిని అడ్డుకోగా ఆ యువకులు నీకెందుకు రా అంటూ అతనిపై దాడి చేశారు. దీంతో గాయాలపాలైన తమ్ముడిని ఏలూరు సర్వజన ఆస్పత్రి అత్యవసర విభాగానికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు.

సొంతింటి కల సాకారం


ప్రధాని ప్రసంగాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి తిలకిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. పట్టణ ప్రాంత పేదల కోసం పీఎంఏవై అర్బన్, గ్రామీణ ప్రాంతాల కోసం పీఎంఏవై గ్రామీణ్ పథకాలను ప్రవేశపెట్టారు. ఒడిషా రాష్ట్రంలో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. పీఎంఏవై ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయం మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు తిలకించారు. వీరితోపాటుగా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పిచ్చయ్య, మెప్మా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, నాయకులు కోమటి రవికు మార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ప్రధాని ఆవాస యోజన పథకంలో విస్సాకోడేరులే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వాటిని మంత్రి వర్మ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ డిపో వెనుకవైపు బైపాస్ రోడ్డును మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డితో కలసి పరిశీలించారు.

లబ్ధిదారులకు

ఇంటి తాళాలు అందజేత


లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేత కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 17: ఇళ్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లాలోని గృహ నిర్మాణ శాఖాధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతు మీదుగా (2023-24) సంవత్సరానికి ఆరు నెలల ముందు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులైన ఏలూరు అర్బన్‌కు చెందిన పిల్లబోయిన అన సూయ, తాడి కుమారిలకు కలెక్టర్ ఇంటి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్హులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ ఎ.శ్రీనివాస రావు, టిడ్కో ఈఈ స్వామినాయుడు, హౌసింగ్ డీఈ జి.రామకృష్ణ, హౌసింగ్ మేనేజర్ ఎండీ షరీఫ్, జిల్లాలోని హౌసింగ్ ఈఈలు, డీఈలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి జీవితం ఆదర్శనీయం


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మోషేన్‌రాజు, తదితరులు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 17 : దేశంలో ప్రతిష్ఠాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి మూడు సార్లు విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన ఘనత సీతారాం ఏచూరికి ఉందని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి మోషేన్‌రాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో చివరి వరకు పార్లమెంట్‌లో సమైక్యాంధ్ర కోసం పోరాడిన ధీరుడు ఏచూరి అన్నారు. మంతెన సీతారాం మాట్లాడుతూ దేశంలోనే అగ్రనాయకునిగా ఎదిగారన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మహాపోరాట యోధుడు సీతారాం ఏచూరి అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఏచూరి మృతి దేశంలో వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పి.హరికుమార్‌రాజు, ఫార్వర్డ్ బ్లాకు జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, సీపీఎం సీనియన్ నాయకులు జుత్తి నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

టి.నరసాపురం, సెప్టెంబరు 17: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలైన సంఘటన మండలంలోని బొర్రంపాలెం మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెంకి చెందిన గొవ్వాడ నాగు బొర్రంపాలెంలో తన పని ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామం తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ఢీకొనడంతో నాగు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో..

ఉంగుటూరు, సెప్టెంబరు 17 : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును కూరగాయల లోడ్డుతో వెళ్తున్న ఆటో ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం తణుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును జాతీయ రహదారిపై కైకరం ఆపగా, అదే సమయంలో వెనక కూరగాయల లోడుతో వస్తున్న ఆటో అదుపు తప్పి వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ తలకు తీవ్ర గాయమైంది. హైవే అంబులెన్స్‌లో ఆటో డ్రైవర్‌ను తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఆకివీడులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

ఆకివీడు/ఉండి సెప్టెంబరు 17 : ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టే సత్తా ఒక్క ప్రధాని మోదీకే సాధ్యమని పతంజలి యోగారోగ్య కేంద్ర వ్యవస్థాపకులు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం పతంజలి యోగారోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. యోగా ప్రముఖులు నేరెళ్ళ రామచెంచయ్య, గొంట్లా గణపతి, మోటుపల్లి గంగాధరరావు తదితరులు ఉన్నారు. ఉండి మండలం ఉండి పెద్దవంతెన సెంటర్‌లో బీజేపీ మండలం అధ్యక్షుడు యర్రా విక్రమ్ అధ్యక్షతన మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- భీమవరం అర్బన్ : భీమవరం వన్‌టౌన్‌లోని సిగ్ని స్కూల్‌లో బీజేపీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.
- ఆచంట/పెనుగొండ : పెదమల్లం మాచేనమ్మ ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం. నాగ సుబ్బారావు పార్టీ కార్యకర్తలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగొండ మండలం రామన్నపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు స్వీట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు.
- నరసాపురం రూరల్/అత్తిలి : నవరసపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో కన్వీనర్ మేకల సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కాలనీ వాసులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కన్వీనర్ మేకల సతీష్, నడిపూడి పండు పాల్గొన్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో మోదీ జన్మదిన పూజలు నిర్వహించారు.
- పెంటపాడు : అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్‌లో మోదీ జన్మదిన వేడుకలను సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్ఎం కల్యాణి పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, కెనాల్ రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేసి, ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, మామిడి శివయ్య, గుడాల ఈశ్వర బాబు, కేవీ కృష్ణవర్మ, కొల్లి కొండప్రసాద్, గవర పవన్ నాయకుడు, వి.దుర్గాప్రసాద్, మల్లవోలు సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

» ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు

ఉండి సెప్టెంబరు 17: నూట ఎనిమిదేళ్ల చరిత్ర కలిగిన ఉండి జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం అని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం ఉండి జడ్పీ ఉన్నత పాఠశాలలో పెంకుటిశాలపై కప్పును తీసి రూఫ్‌ను వేసి పూర్తిచేయడం, టైల్స్ అభివృద్ధి, గ్రౌండ్‌పూడిక, తదితర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. హైస్కూలులో పలు అభివృద్ధి పనులను పూర్తిచేసుకుని అక్టోబరు 2వ తేదీన ప్రారంభిద్దామని తెలిపారు. ఇప్పటికే 570 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని ఈ సంఖ్యను వెయ్యి మందికి పెంచేందుకు కృషిచేయాలని పాఠశాల హెచ్ఎం రామలక్ష్మికి సూచించారు. స్థానిక పెద్దలంతా జూనియర్ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తపల్లి నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మంతెన సాయిలచ్చిరాజు, రుద్రరాజు శ్యాంప్రసాద్‌రాజు, గురుగుబిల్లి సత్యనారాయణ, కరిమెరక శ్రీను, గొల్లవిక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బొలిశెట్టి


పెద్దతిరుపతిలో ఎమ్మెల్యే బొలిశెట్టి, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 17: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండి తులు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదం పంపిణీ చేశారు. బొలిశెట్టితో పాటు తణుకు, కొవ్వూరు ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, పరిమి రవికుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి/ఆచంట, సెప్టెంబరు 17 : ప్రభుత్వ ఐటీఐ ఉండి, ఆచంటలో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత అనంగా 1,2,3వ విడతల లో మిగిలిన సీట్ల కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్స్ వేగేశ్న శ్రీనివాసరాజు ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరే విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్ళను కళాశాలకు స్వయంగా ఈనెల 26వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో అందజేయాలన్నారు. 28న జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఆచంట కాలేజీ వివరాలకు 94901 11002 నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

'క్షీరా రామం'లో పారిశుధ్య వారోత్సవం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 17 : శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. భక్తుడు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆర్కాలజీ శాఖ డీడీ పి.సురేష్, పలువురు ఉన్నతాధికారుల సూచనలతో రాతి స్తంభాలపై ఉన్న ఆయిల్ పెయింట్స్‌తో శాసనాలు కనిపించకుండా పోవడంతో నమూనాగా ఒక స్తంభాన్ని కెమికల్‌తో శుభ్రం చేశారు. జేడా మండపం వద్ద వర్షపు నీరు కారుతున్నందున పరిశీలించి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈవో ఎం.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎంవీస్వామి, గాంధీ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రజా సేవకుడు సీతారామ్ ఏచూరి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు17: ఆదర్శ ప్రజాసేవకుడు సీతారామ్ ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం కొనియాడారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు, పెంటపాడు కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం..

- **ఆచంట , సెప్టెంబరు 17 :** పెదమల్లం వైసీపీ సానుకూల సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ కొండేటి వీరాస్వామి, గంధం శ్రీనివాస్, ఆదిమూలం మణికంఠ, ఆదిమూలం సత్యనారాయణ పాల్గొన్నారు.
- **ఆచంట :** వరదల కారణంగా లంక గ్రామాల్లోని పశువులకు దాణా కొరత ఏర్పడడంతో ఎమ్మెల్యే పితాని ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 40 టన్నుల పశువుల దానాను ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ రైతులకు అందజేశారు.
- **పాలకొల్లుఅర్బన్ :** మాంటిస్సోరి జూనియర్ కళాశాలలో మంగళవారం నేత్ర నిపుణుడు, వరల్డ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యం లో నేత్ర సమస్యలు, జాగ్రత్తలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.
- **పాలకొల్లుఅర్బన్ :** అపదలో ఉన్న మహిళలకు అపన్న హస్తంగా మహిళా మిత్ర సహకరిస్తుందని పట్టణంలోని గరల్స్‌హైస్కూల్లో మంగళవారం జరిగిన బేటి బచావో - బేటీ పడావో అవగాహ కార్యక్రమంలో పట్టణ ఏఎస్ఐ మార్లింగం అన్నారు.
- **తణుకు :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు మంగళవారం సంఘ కార్యాలయంలో డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు.


మొగల్తూరులో ఎమ్మెల్యే నాయకర్‌కు వరద సాయం అందిస్తున్న ప్రతిభ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది.


సీపీఐ రాష్ట్ర క్యాదర్శి కె.రామకృష్ణ, నాగేశ్వరరావులకు నగదు అందజేస్తున్న జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు


భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు విరాళం అందిస్తున్న దాతలు


ఉండిలో ఎమ్మెల్యే రఘురామకు ఇండియన్ డిజిటల్ స్కూల్ ఆధ్వర్యంలో చెక్ అందించిన దృశ్యం

కష్టకాలంలో అండగా..

» విజయవాడ వరద బాధితులకు విరాళాల అందజేత

మొగల్తూరు, సెప్టెంబరు 17 : విజయవాడ వరద బాధితులను కష్టకాలంలో ఆదుకునేందుకు అండగా స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.1లక్షా 82 వేల 700లను మంగళవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు అందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుష్మా, ఉపాధ్యాయులు అడ్డాల సాయికుమార్, కేవీ ప్రసాద్, ముక్కు నాగముని, పద్మనాభుని నగేష్ పాల్గొన్నారు.

- గణపవరం : గణపవరం, నిడమర్రు మండలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేలు నగదును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు మంగళవారం అందించారు. ఆయా మండలాల అధ్యక్షుడు, ఏలూరు జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.సుబ్బరాజు చేతుల మీదుగా అందజేశారు. మరో రూ.10వేలు విరాళాలు అందాయని ఎమ్మెల్యేకు అందజేస్తామని తెలిపారు.
- భీమవరం అర్బన్ : భీమవరం, తాడేపల్లిగూడెం, గణపవరం, ఐ.భీమవరంలలో సీపీఐ మాస్ క్యాంపెయిన్ చేసి సేకరించిన వరద సహాయక నిధి రూ.50వేలు నగదును ఏలూరు స్ఫూర్తి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావుకు సీపీఐ పశ్చిమ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మంగళవారం అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, పశ్చిమ గోదావరి జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మండల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- భీమవరంటౌన్ : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో దాతలు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు రూ.70 వేలు, భీమవరం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ రూ.50 వేలు విరాళాన్ని అందించారు. దాతలను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. అసోసియేషన్ సభ్యులు ఎ.చలపతి, ఎస్. కేశవ, పి.సత్యనారాయణ, ఎ.సత్యసురేష్, ఎం.వెంకయ్య, కనగర్ల కిషోర్, పాపోలు ఏడుకొండలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, విజ్జురోతి రాఘవులు, ఆకుల కృష్ణ, చిక్కాల వెంకటేశ్వరరావు తదితరులు. పట్టణ ప్రముఖుడు గన్నాబత్తుల శ్రీనివాస్ రూ. 25 వేల చెక్కును వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ నాగరాణికి అందించారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి ఉన్నారు.
- ఉండి : ఉండి మండలం వెలివర్రులోని ఇండియన్ డిజిటిల్ హైస్కూల్ విద్యార్థులు ప్రిన్సిపాల్ కె.రజనీకుమార్ అధ్యక్షతన విజయవాడ వరద బాధితుల కోసం మంగళవారం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు అందజేశారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని అభినం దించా రు. కరస్పాండెంట్ కె.విజయకష్ణ, ఏవో గెద్దా ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ టి.సుబ్బారావు, ఇన్‌చార్జి టి.బాలసాయి నాగశ్రీ, ఆఫీస్ ఇన్‌చార్జి కనకలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి పార్కు అభివృద్ధికి రూ.25వేలు సాయం..

ఉండిలోని పార్కు అభివృద్ధికి ఇండియన్ డిజిటల్ హైస్కూల్ యాజమాన్యం రూ.25వేలు చెక్‌ను ఎమ్మెల్యే రఘురామ చేతుల మీదుగా టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజుకు అందించారు. వెలివర్రు, ఉండి గ్రామ టీడీపీ అధ్యక్షులు కలిదిండి కృష్ణంరాజు, కాగిత బుజ్జి, ముదునూరి రంగరాజు, ముదునూరి శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నాగరాణికి రూ.25 వేలు విరాళం అందిస్తున్న గన్నాబత్తుల శ్రీనివాస్


ఎమ్మెల్యే ధర్మరాజుకు రూ.50 వేల నగదు అందజేస్తున్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్

రామగూడెంలో కూరగాయల పంపిణీ

ఆకివీడురూరల్ చినకాపవరం పంచాయతీ రామగూడెం వరద బాధితులకు టీడీపీ నాయకులు చెన్నంశెట్టి శ్రీను కూరగాయలు అందజేశారు. గ్రామమంతా కొల్లేరు వరద నీటిలో ఉంది. ప్రజలు బయటకు రావాలంటే వరద నీటిలోనే రావాల్సి ఉంది. సీఎం ఆదేశాల మేరకు వరద నీరు వచ్చినప్పటి నుంచి కూట మి నాయకులు తాగునీరు ట్యాంకర్ ద్వారా అందజేస్తూ, స్కూల్ పిల్లలను ట్రాక్టర్‌పై పాఠశాలకు తీసుకెళ్ళి తీసుకువస్తున్నారు. మంగళవారం కూరగాయలు పంపిణీ చేశారు. టీడీపీ సీనయర్ నాయకులు మద్రివాడ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


రామాయగూడెంలో కూరగాయలు అందజేసిన టీడీపీ నేత చెన్నంశెట్టి శ్రీను, తదితరులు




ఆచంటలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ.. బొందాడలో మానవహారం.. వడలి జడ్పీ హైస్కూలులో ఈవోపీఆర్‌డీ సీఎస్‌వీ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

నరసాపురం, టౌన్/మొగల్తూరు, సెప్టెంబరు 17: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనంతో ఆరోగ్య జీవన విధానానికి నాంది పలకాలని ఎమ్మెల్యే నాయకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ ఆంజయ్య ఎంపీడీవో వీరభద్రరావు, మేకల సతీష్, కాగిత వెంకటేశ్వరావు, వైఎస్ బాబులు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పడవల మేరీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో చేపట్టిన పరిశుభ్రతా కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, సర్పంచ్‌లతో పాటు కూటమి నాయకులు గుబ్బల నాగరాజు, పాలా రాంబాబు, ముక్కు పుల్లయ్య నాయుడు, లక్కు బాబి తదితరులు పాల్గొన్నారు.

- కాళ్ళ/ఆకివీడు : గ్రామాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలని కాళ్ల మండలం బొండాడ గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు తెలిపారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బొండాడ గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు ఆఆధ్వర్యంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆకివీడు నగర పంచాయతీలో కమిషనర్ జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, జక్కీ, సావిత్రమ్మ, నగర పంచాయతీ మేనేజరు వెంకటేశ్వరరావు, ఎంఈవో సీతారామయ్య ఉన్నారు.
- గణపవరం :గణపవరంలో సరిపల్లె సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు ఒకటో తేదీ వరకు చెత్త సేకరణ, డ్రైన్ల ప్రక్షాళన, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు మానవహారాలు, డ్రైన్ల ప్రక్షాళన చేశారు.
- ఆచంట/పెనుగొండ/పెనుమంత్ర : ఆచంట మండలంలోని అన్నిగ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పి.నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ కోట సరోజిని, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం వడలి జడ్పీ హైస్కూలులో ఈవోపీఆర్‌డీ సీఎస్‌వీ రెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పెనుమంత్ర మండలం పెనుమంత్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మానవహారం ర్యాలీ నిర్వహించారు.
- తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు: తాడేపల్లిగూడెం గూడెం రూరల్ పడాల గ్రామంలో ఎంపీపీ పి. శేషులత ఆధ్వర్యంలో, ప్రత్యేక అధికారి ఎం.వెంకటేష్ అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో విశ్వనాథ్ నేతృత్వంలో గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది మానవహారం నిర్మించారు. జగన్నాథపురంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యదర్శులు కె. శ్రీనివాస్, కె. శ్రీనివాసరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెంటపాడు మండలం పరిమెళ్ల పంచాయతీ గ్రామంలో డీపీవో ఆర్.విక్టర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ నాగరాజు, కార్యదర్శి నాగదేవి పాల్గొన్నారు. పెంటపాడులో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు రూరల్: పెంపాడు మండలంలోని అన్నిగ్రామాల్లో నీటి నిల్వలు ఉన్నప్రాంతాలు గుర్తించి బ్లీచింగ్ చల్లడం, ఘన వ్యర్థాలను తరలించడం, వాణిజ్య సముదాయాల క్లీనింగ్ పబ్లిక్ స్థలాల్లో సుందరీకరణ కార్యక్రమాలు అక్టోబరు ఒకటో తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.
- తణుకు/ఇరగవరం : తణుకు మండలం వేల్పూరులో మండల అభివృద్ధి అధికారి పి.అలివేలు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మానవహారం నిర్మించారు. ఇరగవరం ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ మానవహారం నిర్మించారు.

ఆధ్యాత్మికం

అన్నసమారాధన


మల్లపురాజుపేటలో అన్నసమారాధన

గణపవరం, సెప్టెంబరు 17: వినాయకచవితి పండుగ మత సామరస్యానికి ప్రతీకని ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు అన్నారు. మల్లపురా జుపేటలో శ్రీలక్ష్మీగణపతి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అఖండ అన్న సమారాధనను ఆయన ప్రారం భించారు. కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ యాళ్ళ కల్యాణి, పంపన విగ్నేశ్వరరావు, కామిరెడ్డి హరిబాబు, నక్కా ఆనందరావు, యాళ్ళ శ్రీనివాసరావు, చిరికి రంగబాబు సేవలందించారు.

వేలంలో లడ్డూలను దక్కించుకున్న ముస్లిం మహిళ


ఉండిలో లడ్డూతో షేక్ నసీమా

ఉండి/ఆచంట/పెంటపాడు/భీమవరం టౌన్/అత్తిలి, సెప్టెంబరు 17: హిందూ పండుగలంటే ఎంతో ఇష్టమని.. భగవంతుని ప్రార్థించి ఆశీర్వాదాలు అందుకోవాలి అనేది తన అభిమతం అంటూ ఉండికి చెందిన ముస్లిం సోదరి షేక్ నసీమా అన్నారు. ఉండి సీతారామపేటలో వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా గణనాథుడికి సమర్పించిన 15 కేజీల లడ్డూ ప్రసాదాన్ని రూ.12,500కు పాటలో సొంతం చేసుకుంది. ఉండి పడవలరేవులోని ఉత్సవ కమిటీ నిర్వహించిన వేలం పాటలో 51 కేజీల లడ్డూ ప్రసాదాన్ని రూ.22,500కు దక్కించుకుంది. ఆచంటలో గణనాథులను ప్రత్యేకంగా అలంకరించి తీన్‌మార్, గరగనృత్యాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. పెంటపాడు మండలం పడమరవిప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భీమవరం పట్టణంలోని మెంటేవారి తోటలోని బాలత్రిపుర సుందరిదేవి దేవాలయంలోని పౌర్ణమి సందర్భంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నులి పురుగుల నివారణ మందు వేసుకోవాలి : కలెక్టర్

భీమవరంటౌన్/ఆకివీడు/పాలకొల్లు రూరల్ /పాలకొల్లు అర్బన్/తణుకు/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/మొగల్తూరు/అత్తిలి, సెప్టెంబరు 17 :నులి పురు గుల నివారణ మాత్రలు వేసుకుని రక్తహీనతకు దూరం కావాలని కలెక్టర్ నాగరాణి విద్యార్థులకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం పట్టణంలో చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్లో ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఆకివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటపతిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సుమారు 8,300 మందికి మాత్రలు వేశామన్నారు. పాలకొల్లు పట్టణం మండలంలో మంగళవారం పాఠశాలలు, కళాశాలల్లోని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్, వైద్యులు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. తణుకు పట్టణంలో సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు ఎంఈవో వి. హనుమ, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. లక్ష్మీకాంతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవల్లిక, ప్రిన్సిపాల్ బి. రాజారావు మాత్రలు అందించారు. పెంటపాడు మండలంలో ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 93 శాతం మందికి మాత్రలు వేసినట్లు పీహెచ్ సీ వైద్యాధికారులు డాక్టర్ తోట రాజేష్‌కుమార్, డాక్టర్ మౌనిక, డాక్టర్ పూజిత తెలిపారు. మొగల్తూరు మండలంలోని 72 పాఠశాలలోని విద్యార్థులకు సుమారు 8508 మందికి మాత్రలు అందిచామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. అత్తిలి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరవల్లి అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి ఆధ్వర్యంలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, సెప్టెంబరు 17: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 19న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్, అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

పోడూరులో మధ్యాహ్న భోజనం పథకం పరిశీలన

పోడూరు, సెప్టెంబరు 17 : పోడూరు జడ్పీ హైస్కూలులో మంగళవారం తహసీల్దార్ మహ్మద్ సయ్యద్‌పాజిల్ మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన వంటకాలను ఆయన రుచి చూసి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. హెచ్ఎం ఐ.జనార్దనరెడ్డి, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన వలవల


మంత్రి లోకేశ్‌ను కలిసిన బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 17: విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు నివాసం వద్ద మంగళవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిల సమావేశంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


పాలకొల్లులో విశ్వకర్మ భగవాన్ గ్రామోత్సవం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకార సంఘ సభ్యులు

భీమవరంటౌన్/పాలకొల్లు అర్బన్/తాడేపల్లిగూడెం రూరల్/పెనుగొండ/పోడూరు/అత్తిలి/పెనుమంత్ర, సెప్టెంబరు 17 :విశ్వకర్మ స్ఫూర్తితో విద్యార్థులను ఇన్నోవేటివ్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో దైవిక వాస్తుశిల్పి విరాట్ విశ్వకర్మ జయంతి వేడుక ఘనంగా జరిగింది. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా విశ్వబ్రాహ్మిణ్ సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్ లక్కోజు సత్తిబాబు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జీవీఎస్ కె.గణపతిరావు, జిల్లా వైద్య శాఖ అధికారి డి. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ సంఘం, పట్టణ స్వర్ణకార సంఘం సయుక్తంగా పంచ బ్రహ్మ దంపతులచే పూజలు చేసి, అఖండ దీపారాధన, విశ్వకర్మ పూజలను ఆరంభించారు. విశ్వకర్మ పతాకాన్ని ఆలయ నిర్మాణ దాత నాగులకొండ గోపి సత్యనారాయణ, శాంతిరత్న దంపతులు ఆవిష్కరించారు. అనంతరం విశ్వకర్మ చిత్రపటాన్ని వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఓవర్ బ్రిడ్జి వద్ద గల మల్లికార్జున కల్యాణ మండపంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో కామాక్షి, గాయత్రి, విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. పోడూరు మండలం పోడూరులో వీర బ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అత్తిలి మండలం అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘ కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి, బల్లంకి ఆచారి ఆధ్వర్యంలో కొవ్విడి వెంకన్నబాబు పూజా కార్యక్రమం జరిపారు. పెనుమంత్ర మండలం మార్టేరు పంచ గ్రామం, మార్టేరు గ్రామంలో శ్రీకామాక్షి దేవి ఆలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా జొన్నకోటి. పోసిబాబు, అన్నపూర్ణ దంపతులచే పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

కుష్ఠువ్యాధిగ్రస్తులకు రగ్గుల పంపిణీ

భీమవరంటౌన్, సెప్టెంబరు 17 : వ్యాపారవేత్త వేగేశ్న కృష్ణంరాజు కుమారుడు శ్రీరామరాజు జ్ఞాపకార్థం భీమవరం లెప్రసీ సెంటర్‌లోని 126 మంది కుష్ఠువ్యాధిగ్రస్థులకు రగ్గులు అందించామని నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. అతడు మరణించి ఐదేళ్లు గడిచిందని, గతించిన వారి పేరిట వారి తల్లిదండ్రులు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ స్వచ్ఛతా హి కార్యక్రమంలో పాల్గొన్న 600మంది విద్యార్థులకు బిస్కెట్స్‌ప్యాకెట్లు అందించారని తెలిపారు. కుష్ఠు వ్యాధి కాలనీ అధ్యక్షుడు వీర్రాజు, కృష్ణంరాజు కుటుంబ సభ్యులు వేగేశ్న రవి పాల్గొన్నారు.

రూ 1.40 కోట్లు నిధుల మంజూరు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 17: ఇటీవల గ్రామ సభల ద్వారా ప్రభుత్వం మండలంలో ఎనిమిది సీసీ రహదార్లకు రూ 1.40 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. తూర్పుతాళ్ళు, సీతారాంపురం, చామకూరిపాలెం, ఎల్‌బీచర్ల, పీఎంలంక, పసలదీవి గ్రామాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఒక్కొక్క రహదారికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.